
విజయనగరం,
23–8–76.

ానికి, అమ్మ దీవించి వ్రాయునది :

నువ్వు నీ క్యాంప్ నించి విశాఖపట్నం తిరిగి వచ్చేసరికి, నీకీ ఉత్తరం అందుతుంది. నీకు చెప్పకుండా యిల్లు వదిలిపెట్టేను. మరో పరిష్కార మార్గం నాకు కనిపించలేదు. కాని నిన్ను చూడకుండా ఒక్కరోజన్నా గడపడం నాకెంత కష్టమో నీకు తెలుసు. నా ప్రాణాలన్నీ నీమీదే పెట్టుకొని నీకోసమనే బతికేను. మరి నా బతుకులో ఏం మిగిలిందని బతికేను ? పాతికేళ్ల క్రిందనాటి ఆరోజు తలచుకుంటే ఇప్పటికీ ఒళ్ళు కంరుకట్టుకు పోతుంది !




* * *

ఆరోజు సాయంత్రం చల్లగా వుంది. చల్లగాలి హాయిగా వేస్తోంది. పిల్లలంతా వీధిలో పిచ్చుకగూళ్లు కట్టుకొని ఆడుకుంటున్నారు.

సరస్వతి జడ వేసుకుంది. ముఖం సేండల్‌వుడ్ సబ్బుతో రుద్దుకొని, పాండ్స్ పౌడర్ అద్దుకుంది. సిగలో మల్లెలు తురుముకుంది. భర్త నిన్న తనకోసం కొనితెచ్చిన వాయిల్‌చీర కట్టుకుంది. ఆరోజు ఆమె పుట్టినరోజు. పాతిక వసంతాలు నిండేయి. చిగుళ్ళతోనూ, పూలతోనూ నిండుగా వున్న మామిడిచెట్టులా వుందామె. మనస్సులో ఆనందపు కోయిలలు కూస్తున్నాయి.

బయట మట్టిలో ఆడుకుంటున్న కొడుకుని పిలిచింది. "నాన్నారు వచ్చే వేళయింది—లోపలికొచ్చి, మొహం కడుక్కొని. బట్టలు మార్చుకో రామం ! నువ్వు రావా పాతాళభైరవి సినీమాకి ?"

"ఇదుగో వచ్చేస్తున్నానమ్మా ! నాన్నారు రానీ ముందు !" ఏడేళ్ల రామం కేకపెట్టేడు తిరిగి.

మాటిమాటికీ వీధిలోకి వెళ్లి తొంగిచూస్తూ భర్తకోసం కాచుకొనివుంది సరస్వతి.

సినిమా ప్రారంభం అయే వేళ అయిపోయింది కాని అతను రాలేదు ఆఫీసునించి.

ఆకాశం విరిగి నేలమీద పడుతుందా ? పడదు. కాళ్ల క్రింద భూమి నిల్చున్నపాళంగానే విడిపోతుందా? విడిపోదు.

కాని, మానవ జీవితంలో అటువంటి అనుకోని సంఘటనలే జరుగుతూవుంటాయి.

ఆఫీసునించి ఇద్దరు క్లర్కులు వచ్చి అటువంటి సంఘటనే జరిగిందని చెప్పేరు – ఆకాశాన్ని ఆమె నెత్తిమీద వేసేరు. భూమికి ఆమె కాళ్లకిందే కన్నం పడేలా చేసేరు.

ఆఫీసు వదిలేక, బయటకొచ్చి, సైకిలు తియ్యబోతూ మొహం తిరిగి పడిపోయేడుట ఆమె భర్త– హాస్పిటల్‌లో చేర్చి చెప్పడానికి వచ్చేరు – తోడ్కువెళ్లేరు.

మనిషికి ఏక్సిడెంట్ జరుగుతే ఇలా కాని, అలా కాని జాగర్త పడితే అది జరిగి ఉండకపోను అనుకోవచ్చు – కేన్సర్ వస్తే, సిగరెట్లు ఎక్కువ కాల్చడం వల్ల అని కారణం చెప్పకోవచ్చు – దేనికన్నా మందుంది, ఎందుకు వస్తుందో తెలుస్తుంది – రాకుండా జాగర్తపడొచ్చు.

కాని "సెరిబ్రల్ హెమొరేజ్"కి కారణమూ లేదు, మందూ లేదు – మెదడులో ఒక ప్రాంతంలో బ్లడ్‌సెల్ పేలిపోయి రక్తస్రావం జరుగుతుంది మెదడులో – తెలివి పోతుంది – మరి రాదు. 'కోమా'లో ఉండి ఉండి ప్రాణం పోగొట్టుకుంటాడు రోగి.

అదే జరిగింది సరస్వతి భర్తకి –

ఆమె హాస్పిటల్ చేరుకొనేసరికి చూసింది అతడి మృతదేహాన్ని.

ఆ షాక్‌తో తెలివి పోగొట్టుకుని కూలిపోయింది.

* * *

**రామం !** ఆ రోజునుంచీ చావాలనే ఉండేది — కాని అందరూ నీ కోసం నేను బతకక తప్పదన్నారు. నీ కోసమే బతికేను. నా పుట్టింటికి వెళ్లినా అది నా కాళ్లమీద నేను నిలబడగలిగేవరకే ననుకున్నాను. మెట్రిక్ పాసయి, ట్రెయినింగయి ఆడపిల్లల చిన్న స్కూల్లో టీచరుగా చేరేను. తరవాత ప్రయివేటుగా కట్టి బి. ఏ. పాసయ్యేను. బి.యిడీ ట్రెయినింగ్ అయ్యేను.

నా కొకటే కోరిక — నిన్ను ఒక మంచి డాక్టర్‌గా చెయ్యగలగాలని — నీమీదే నా ప్రాణం పెట్టుకొని రోజులు గడిపేను. నీ ఆలనా, పాలనా, చదువూ అన్నీ స్వయంగా చూసుకొనేదాన్ని—ఎవ్వరినీ నీ సంరక్షణకి దగ్గరకి రానిచ్చేదానిని కాను. నా భయం ఒక్కటే — మానసికంగా నువ్వు నానుండి ఎక్కడ దూరంగా అయిపోతావేమోనని నా భయం.

నువ్వు మాత్రం !? ఒక్క క్షణమన్నా అమ్మ ఆగపడకపోయేసరికి కొట్టుకపోయేవాడివి. అమ్మే అన్నం పెట్టాలి... బట్టలు అందివ్వాలి... చదువు చెప్పాలి... ఎక్కడికి వెళ్లినా అమ్మ తోడుగా ఉండాలి.

నిన్ను పెంచుకుంటూ, చూసుకుంటూ, నీ అభివృద్ధి చూస్తూ బాధలన్నీ మరిచిపోయి, ఏళ్ళు నిముషాలుగా గడిపేసాను.

డాక్టరు వయ్యేవు ! ఆ రోజున నా ఆనందం ఏమని చెప్పను !

నా దీక్ష ఫలించింది ! మరో రెండేళ్లు కష్టపడి ఎమ్. డి. చేసేవు — ప్రాక్టీసు పెట్టేవు. బీద వాళ్లకి సాయపడడమే ఆదర్శంగా పెట్టుకోమన్న నా మాట మన్నించేవు — చుట్టుపక్కల పల్లెలకి కూడా వెళ్లి అక్కడ పల్లె ప్రజల బాగోగులు చూసేవాడివి — **మూడు** పువ్వులూ ఆరు కాయలుగా నీ ప్రాక్టీసు వృద్ధిపొందింది.

ఏ ఊరన్నా వెళ్లి మూడు రోజులు ఉండవలసి వస్తే నేను ఉండనిదీ వెళ్లేవాడివి కావు—నా ఉద్యోగం మానిపించేవు — అమ్మ లేనిదీ ఒక్క క్షణమన్నా ఉండలేననేవాడివి — నేను మాత్రం నిన్ను వదిలి ఉండగలిగేదానినా ?

కాని నాకెందుకో మనసులో ఒక భయం! ఇదంతా శాశ్వతం కాదని — నువ్వు నాకు కాకుండా దూరంగా పోతావన్న భయం! మన ఇద్దరి మధ్యా ఉన్న అనుబంధానికి విఘాతం కలుగుతుందన్న బెదురు — అందువల్లే, నీ పెళ్లి మాట ఎవరన్నా తలపెడితే గుండె ఆగిపోయినట్టయేది. నీమీద నాకున్న మమకారం, అనురాగం మరొకరితో పంచుకోలేను — నీ మనసులో నామీద ఉండే ఆత్మీయతని మరొక స్త్రీ వస్తే తగ్గించేస్తుందన్న భయం నాకు ఎక్కువయింది. ఎవరు నీ పెళ్లి ప్రసక్తి తెచ్చినా ఆ ప్రసంగం మార్చేదాన్ని —

ఆనాడు నువ్వు డాక్టర్ వెంకట్రావుగారి ఇంటికి వెళ్దామని తీసుకవెళ్లేక (అతనింటికి నేను ఎప్పుడూ వెళ్లలేదు.) అక్కడ అతడి కూతురు సుశీల పరిచయం నాకు కలిగినప్పుడు నేను కట్టుకున్న మేడ కూలిపోయినట్టయింది. ఏ వంక చెప్పగలను ? అందం, గుణం, చదువు, సంస్కారం, వంశం, హోదా, డబ్బు అన్నీ అన్నివిధాలా సరిపోతున్నప్పుడు, ఆ పిల్లమీద నీ మనసు ఉన్నప్పుడు ఏ సాకు చెప్పి తప్పించగలను ? సుశీలే మన ఇంట కాలుమోపితే ఇంట్లో నా స్థానం ఏమౌతుందో ఊహించుకుందుకి అట్టేసేపు పట్టలేదు. ఆ అందానికి నువ్వు బానిసవవుతావు — నాతో ఇంక మనసు విప్పి మాట్లాడవు. "నువ్వు నానుంచి దూరంగా పోతే నేను బతకలేను ! నా కన్యాయం చెయ్యకు !" అని అరవాలనిపించింది. మనసులోనే కన్నీళ్లు కార్చేను.

సుశీలతో నీకు పెళ్లి జరిపించేను.

ఆ రోజునించీ నా యమయాతన ఆరంభమయింది. నువ్వు నవ్వుతూ సుశీలతో మాట్లాడ్డం చూసినా, సుశీల ఆనందంగా, సంతోషంగా ఉండడం చూసినా నా మనస్సు మంచులా గడ్డ కట్టేది. నీమీద కోపం వచ్చేది సుశీలమీద మనస్సు మండిపోయేది. నీమీద అలిగి నీతో మాటలు మానేదానిని. అన్నం తినడం మానేదానిని — నువ్వొచ్చి బతిమిలాడినా, నా కాళ్ళు పట్టుకున్నా, సుశీల వచ్చి ప్రాధేయపడ్డా తిండి తినేదానిని కాను. మీ ఆనందం తన్మూలంగా భంగమయి మీరిద్దరూ నాకోసం బాధపడితేనే తప్ప నాకు ఆనందం, తృప్తి ఉండేవికావు.

కాని నువ్వు నొచ్చుకొని బాధపడగా నాకూ బాధవేసేది. జాలి వేసేది. నీ ఆనందం పాడుచెయ్యడానికి నాకుండే హక్కేమిటనిపించేది. భార్య భార్యే, తల్లి తల్లే అనిపించేది. మళ్లీ రెండ్రోజులు గడవగానే మీ ఇద్దరూ ఆనందంగా ఉన్నా, నన్ను కాదని, నాతో చెప్పకుండా ఏ పని చేసినా, చెట్టాపట్టా వేసుకొని తిరగడానికి పోయినా మళ్లా మంటలు మనసులో మండేవి.

రాను రాను నా మాటలతో మీ ఇద్దరి మనసునీ బాధపట్టేను. నేను నీకోసం చేసే ఏ పనిని కూడా సుశీల చేత చెయ్యనిచ్చేదానిని కాను. ఎందులోనూ, ఏ పెత్తనమూ లేకుండా చేసేను దానికి. దానిమీద చాడీలు చెప్పేదానిని. క్రమేపీ నువ్వు నా దగ్గరకు రాసాగేవు మానసికంగా —

కాని, నేను అనుకోనిది ఒకటి — సుశీల నామీద తిరగబడుతుందని ఏనాడూ అనుకోలేకపోయేను. తన ఆస్తిని రక్షించుకొనే అడవిమనిషిలా మీదని కలియపడింది. మాటకి మాట జవాబిచ్చేది. క్రమేపీ నా మనసుని గాయపరచే మాటలు అనసాగింది. తిరిగి జవాబిస్తే కలియపడేది !

*　　*　　*

ఒక రోజున రామారావు రాత్రి పదయినా రాలేదు.

సరస్వతి వంట ఇంట్లో కూర్చుంది కొడుకు వస్తే అన్నం పెడదామని. ఏదో పుస్తకం చదువుకుంటోంది — సుశీల వచ్చి అంది : "మీరు వెళ్లి పడుకోండి — నేను వడ్డించేస్తాను లెండి ఆయనొస్తే !"

సరస్వతి : "నాకు తెలివేసి ఉండడం అలవాటే — నువ్వు తెలివేసి ఉంటే నీ ఆరోగ్యం దెబ్బతింటుంది."

సుశీల : "నా ఆరోగ్యం గురించి మీ కంత ఆతృత, శ్రద్ధా ఎందుకో ?"

"కోడలివి కనక !" వెటకారంగా అంది అత్తగారు.

"అంతేకాని నేను వడ్డిస్తే ఒప్పుకోరు! అంతేనా ? నేనేమన్నా విషం కలిపిపెడతానని భయమా ?" కోడలు కూడా వ్యంగ్యం జోడించి ఘాటుగానే అంటించింది.

సరస్వతికి కోపం బుసలు కొట్టింది — విసురుగా చెప్పింది. "ఏమో ! అంత పని చేసినా చేస్తావ్ !"

"విషం కలుపుతే నేను ముండమొయ్యనా ?" కసిగా అరిచింది సుశీల భరించలేక —

ఆ తరవాత పెద్ద రభస జరిగింది. అదంతా రెండో ఉత్తరంలో ఉంది.

సుశీల కళ్లవెంబడి బొటబొటా నీళ్ళు కారేయి. "నన్ను మీ ఇష్టం వచ్చినట్టు మాటలు అనొచ్చు — కాని నేను నోరు ఎత్తడానికి వీల్లేదు. మీ అబ్బాయికి పెళ్లెందుకు చేసేరు ? ఇద్దరూ కలిసినా గొంతెదుకు నొక్కేరు ?"

ఆ సమయంలో రామారావు వచ్చేడు.

జరుగుతున్నది చూసి చేష్టలుడిగి నిలబడిపోయేడు.

*　　*　　*

నువ్వు పడే బాధ చూసి నా మనసు తరుక్కుపోయేది. సుశీలంటే నీ కెంత ప్రేమో నాకు తెలుసు — నేనంటే నీకున్న అభిమానమూ నాకు తెలుసు.

ఎవరి పక్షమూ వహించలేక నువ్వు పడే నరక యాతన చూస్తే, సుశీలమీద నా ద్వేషం పెరిగిందే కాని తగ్గలేదు.

నువ్వు ఇంటికి రావడమే తగ్గించుకున్నావ్ — ఈ ఊరూ ఆ ఊరూ క్యాంప్‌లంటూ తిరగడం ఆరంభించేవు. మా ఇద్దరితోనూ మాటలు తగ్గించేవు. చిక్కి శల్యమైపోయేవు — నేను నీ బాధ చూడలేను. సుశీల కళ్లలో నామీద ఉండే ద్వేషమూ భరించలేను.

కిందటి ఆదివారం నువ్వు వారం రోజుల వరకూ రావని చెప్పి అరుకువేలీ వెళ్లిపోయేవు.

నువ్వు వెళ్లిన రెండు రోజుల తరువాత మాట మీద మాట వచ్చి నామీద తిరగబడింది సుశీల — అనరాని మాటలంది. ఆమె మాటల సారాంశం ఇది.

"నువ్వు రాక్షసివి — నువ్వు ముండమోసేవని, నా మొగుడు బతికుండగానే నాచేత ముండమోయిద్దామని నీ ప్రయత్నం నన్నూ అతన్నీ వేరు చేసి — నీ మొహం మరి చూడను. ఈ ఇంట్లోంచి పో — ఈ ఇల్లు నాది — నీ కిక్కడ హక్కు లేదు !"

ఇలా అర్థం వచ్చే ఎన్నో మాటలంది — నేను మరి వినలేకపోయేను. నేను ఇల్లు వదిలేసి నా అన్న దగ్గరికి వచ్చేసేను ఆ రాత్రే —

నువ్వు లేకుండా... నిన్ను చూడకుండా, నేను బతకలేను... ఆ ఇంట్లో రోజూ సుశీల ద్వేషాన్నీ, తిరుగుబాటునీ ఎదుర్కుంటూ ఉండనూలేను.

దీనికి పరిష్కార మార్గం నువ్వే ఆలోచించు— నాకు ఒకే దారి కనిపిస్తోంది — చావు !

ఈ ఉత్తరం నీకు ఎల్లుండి కందుతుంది ఎంత ఆలశ్యమయినా — నువ్వు ఇవాళ క్యాంప్‌నుంచి వచ్చేసి ఉంటావు. నువ్వూ కోడలూ వచ్చి నన్ను పిలిచి తీసుకవెళ్తే సరేసరి — ఆమె ప్రవర్తనకి ఆమె క్షమాపణ చెప్పుకోవాలి — నేనింక మీ జోలికి రాను — నిన్ను చూసుకుంటూ ఆఖరి రోజులు గడిపేస్తాను.

( 32 వ పేజీ చూడండి)

వారం రోజులు చూస్తాను — మీరు వచ్చే ఆదివారానికి రానప్పుడు... నేను రావడం మీ కిష్టం లేదని భావించి, ఈ లోకంలోంచే శాశ్వతంగా తప్పుకుంటాను —

తరువాత మీరు హాయిగా సుఖంగా ఉండండి.

నీ కన్న తల్లి,
సరస్వతి.

* * *

రాజమండ్రీ,
23–8–76.

శ్రీవారికి సుశీల నమస్కారాలు చేసి రాసుకున్నది :

ఈ ఉత్తరం మీకు చేరేసరికి మీరు క్యాంప్ నించి వచ్చేసే ఉంటారు.

గతాన్ని మీకు కొంత గుర్తుచేసి వర్తమానం లోకి వస్తాను.

ఆనాడు పెళ్ళిచూపులకి మీరు మా ఇంటికి వచ్చినపుడు నా అంతటి అదృష్టవంతురాలు ఈ లోకంలో ఉండదనుకున్నాను. మీరు నేను మీకు నచ్చినట్టు మీ అమ్మగారికి చెప్పినపుడే నా మనసుని మీకు సమర్పించుకున్నాను. ఆ మాటకొస్తే మా నాన్నగారు అంతకుముందే నన్ను మీకు పరిచయం చేసినప్పుడు మీ ఇంట అడుగుపెట్టే అదృష్టం నాకుంటుందో ఉండదో అని ఆందోళన కలిగింది. ఎలా అయితేనేం మీ అమ్మగారు "సరే" అన్నారు.

కాని ఒప్పందం అయినా, పెళ్ళికి ముహూర్తం పెడతామంటే ఆగండాగండంటూ మీ అమ్మగారు జాప్యం చెయ్యడంతో నా మనసుని భయం ఆవహించింది, మీరు నాకు దక్కకుండాపోతారని — ఆ ఆలస్యానికి కారణం మీ అమ్మగారేనని తరువాత తెలిసింది.

ఆఖరి కెలాగయితేనేం పుస్తె కట్టేరు — మీ అమ్మ కట్టనిచ్చేరు.

వైవాహిక జీవితం గురించి నాకెన్నో ఊహ లుండేవి. ఎన్నో తియ్యని కలలు కన్నాను. మన ఇద్దరి జీవితమూ అనురాగపూరితంగా ఎంతో ఆనందంగా గడిచిపోతుందని అనుకున్నాను. కాని ఒక సంగతి తెలుసుకోలేకపోయేను. మీ మనోవాక్కాయ కర్మలని ఓ పంజరంలో రామచిలుకని బంధించినట్టు, బంధించి తన అధీనంలో ఉంచుకున్న వ్యక్తి మీ అమ్మ రూపంలో ఉందనీ, ఆమె ఆడించినట్టే మీరు ఆడగలరనీ —

కాని మీ ఇంట అడుగిడగానే ఆ సంగతి నేను గ్రహించేను. మీ అమ్మ మీ మనసులోని జాగానంతా ఆక్రమించుకొని పీఠం వేసుక కూర్చుందనీ, ఆ పీఠాన్ని పెళ్ళగించడానికి ఆ బ్రహ్మదేవుడే దిగి రావాలని, నాకు ఏమాత్రం చోటూ మిగల్చలేదనీ తెలుసుకున్నాను — నేను మీకు కేవలం ఆడదానినే కాని, మీ కష్టసుఖాలూ, మీ మానసిక భావాలూ, అనురాగాపేక్షలూ పంచుకొనే భార్యని కాననీ, అలా మీరు నన్ను చూడడంలేదనీ నాకు తట్టింది.

మీ కెప్పుడూ మీ ప్రాక్టీసూ, మీ అమ్మ. ఈ రెండూ ఉంటే చాలు. ఒక్కనాడూ మనసు విప్పి మీరు నాతో మాట్లాడలేదు. ఏదో జంకు, పిరికితనం, భయం! చిన్నపుడు ఆటలాడుకొనే టప్పుడు అనుకొనేవాళ్ళం, "ఇంటికి వెళ్ళిపోవాలి! అమ్మ కోంబడుతుంది!" అని. ఆ మనస్తత్వం



# కర్రపెట్టెలో కళేబరాలు

(25 వ పేజీ తరువాయి)

అలానే మీకుండిపోయింది.

ఇంక మీ అమ్మ! మనం అనుకొనే ప్రతి మాటా, మనం చేసే ప్రతి పనీ గమనిస్తూ, ఎక్కడ మీ మనసుని ఆమెమీదకి తిప్పి విషపూరితం చేస్తానో అని అనుమానపడుతూ, దుబ్బువాటు పులిలా ఉండేది. దాంతో ఆరంభమయింది మా మధ్య యుద్ధం — మొదట ప్రచ్ఛన్న యుద్ధం, తరువాత బహిరంగ యుద్ధంగా మారింది. నన్ను ఆమె అనే డెప్పిపొడుపు మాటలు, నాకు చేసిన అవమానాలూ మీకు చెప్పలేదు నేను — మీరు బాధపడతారని.

రాను రానూ మీకు నామీద ఏర్పడ్డ ఆ కాస్త ప్రేమానుబంధమూ సడలిపోయింది. మీ అమ్మ నన్ను అనే బాధాకరమైన మాటల గురించి మీకు చెప్పినా మీరు పెడచెవిని పెట్టేవారు—ఇంటి కోడలిని కనక అత్తగారి సాధింపులూ, మాటలూ నేను పడాలని మీ ఉద్దేశమో ఏమో ?

మూడుసార్లు పుట్టింటికి వెళ్ళిపోయేను కొన్నాళ్ళ నే లేకపోతేనన్నా అత్తగారు మారుతుందని నేను మీకు దూరమవగానే ఎంతో ప్రేమగా ఉత్తరాలు రాస్తూ, రమ్మని ప్రాధేయపడేవారు — తీరా వచ్చేసరికి మంచుముక్కలా గడ్డ కట్టుక పోయేవారు.

రోజులు గడుస్తున్నకొద్దీ నా పరిస్థితి నరకంలా మారింది. ఇల్లొక యమలోకం అయింది. ఓసారి భరించలేక, విషం తాగి ఛస్తాను అని మీ అమ్మతో అన్నాను మీరు వింటూ ఉండగానే — ఛస్తానన్న వాళ్ళెవరూ చావరు, చావడం సులభం కాదని మీ అమ్మ అంటే మీరు తల ఊపేరు.

నా భర్తయిన మీతో నేను కులాసాగా కబుర్లు చెప్పుకో వల్లకాదు — మీతో కలిసి సినిమాలకీ క్లబ్బులకీ వెళ్ళడానికి వీలులేదు. హాయిగా నవ్వకూడదు. మనసు విప్పి పాడుకోకూడదు — మీకు ఏ సేవలూ నేను చెయ్యకూడదు — నేను అన్నం పెడితే అందులో విషం కలుపుతానని మీ అమ్మ భయం కామోసు.

నేనింక ఓర్చుకోలేను — మీరూ మీ అమ్మా కలిసి నన్ను పిచ్చిదానిగా మార్చేసేరు. వారం వరకూ రానని మీరు అరుకువ్యేలీ వెళ్ళిపోయేరు కారు తీసుకొని. (అది నన్ను తప్పించుకొనేందుకు మీ ఎత్తు) — వెళ్ళిన రెండో రోజున మీ అమ్మగారు చేసింది ప్రళయం.

* * *

ఆరోజు సుశీల వండలేదు — సోఫాలో పడుకుంది.

అత్తగారొచ్చి ఈసడింపుగా అంది: "వంటా పెంటా ఏమీ అక్కర్లేదా ? అలా పడుకున్నావ్ ? బెంగ పెట్టుకుంటున్నావా ?"

"నాకే బెంగా లేదు—మీకే అన్నీ బెంగలూనూ. నేను వండకూడదని శాసించేరుగా ?"

"అబ్బాయి లేడుగా?" అందామె వెటకారంగా.

"అబ్బాయి లేరుకాబట్టే, అబ్బాయికోసం బెంగతో మంచంవేసారు కాబట్టే, నేను వండాలి — మీ అన్నంలో విషం కలుపుతానని మీకు భయంలేదా ?"

"నాకెందుకు పెడతావ్ విషం ? వాడికే పెడితే నీకు రెండు లాభాలు. వాడి పీడా, వాడిమీద బెంగతో నేపోతే నా పీడా నీకు విరగడౌతాయి." అందామె విసురుగా అక్కసంతా వెళ్ళబోస్తూ.

సుశీల పులిలా ఆమె మీద కురికి ఆమె భుజాలు పట్టుక కుదుపుతూ అరిచింది — "నేనెవ్వరికీ పెట్టను విషం. నేనే తిని ఛస్తాను. నా మొగుడికి నేను విషం పెడతానంటారా ? అలా ఆలోచించడానికన్నా మీ కెటువంటి మనసిచ్చేడు దేవుడు ?"

సరస్వతి విదిలించుకొని అంది : "వేగం ఆ పని చెయ్యి...!"

* * *

నేనింక ఆవేశం ఆపుకోలేక అనవలసిన నాలుగూ అనేసేను.

ఈ యింట్లో ఆవిడకి స్థానం లేదని చెప్పేసేను. ఈ యిల్లు నాదీ, నా భర్తదీ అని చెప్పేసేను.

ఆమె వెంటనే అక్కసుకొద్దీ పెట్టె బేడా సర్దుకొని పుట్టింటికి వెళ్ళిపోయింది. అంటే మీ మేనమామ యింటికి.

నాకేనా లేదు పుట్టిల్లు ? మర్నాడుదయం నేనూ పుట్టింటికి వచ్చేసేను.

ఈ వుత్తరం మీకు, మీరు క్యాంప్ నించి తిరిగివచ్చిన రోజున అందుతుంది.

మీకు నేనే కావాలో, మీ అమ్మే కావాలో నిశ్చయించుకోండి. నేనే కావాల్సివస్తే మీరు స్వయంగా వచ్చి నన్ను తోడ్కుకెళ్ళండి. మీ అమ్మని ఆమె అన్న దగ్గరే వుండనివ్వండి. మీ అమ్మే కావాలంటే ఆమె దగ్గరికే వెళ్ళండి.

ఈ వుత్తరం మీకు మంగళవారానికి అందుతుంది. మరోరోజు ఆలస్యం కలుపుకున్నా బుధవారాని కందుతుంది. మరో రెండురోజులు మీకు వదుల్తున్నాను. మీరు శనివారానికల్లా నా అవసరం వుంటే నాదగ్గరి కొస్తారు. మరోరోజు కలిపి, ఆదివారానికల్లా మీరు యిక్కడికి రానపుడు నా అవసరం మీకు లేదని నిశ్చయానికొస్తాను.

ఆడది ఒక్కరికే మనసుని అర్పిస్తుంది అతడే భర్త అయినపుడు, ఆ భర్త ఆమెను విడనాడినప్పుడు ఆమె మరి బతకనవసరంలేదు.

నాదగ్గర ఓ చిన్న సీసాలో స్లీపింగ్ పిల్సున్నాయి. ఆదివారంనాడు మీరు రానప్పుడు సోమవారం ఉదయం నా శవాన్ని దహనం చెయ్యడానికన్నా రండి ! చస్తానికూడా రాసేసేను. అలా రాసేసినా మీరు రాకపోతే నేను చావక యెల వుండగలను ? వుండి లాభం ఏమిటి ?

మీ — సుశీల.

* * *

అరుకులోయ
22–8–76

ప్రియమైన సుశీలకి,

ఇంట్లో ఇంక వుండడం దుర్భరమై యీ క్యాంప్ మిషతో యిక్కడి కొచ్చేసేను.

నా కప్పు డప్పు డనిపిస్తూ వుంటుంది దేవుడు మనిషికి రెండు శరీరాలిస్తే బాగుణ్ణని. అప్పుడు ఒకటి నీకు, ఒకటి అమ్మకి యిచ్చివుందును.

నేను నిన్నెంతగా ప్రేమిస్తున్నానో నువ్వు

ప్రేమ ... సుశీలా ! నా మనస్సు అందరిలాగా బోళాగా నీముందు ప్రదర్శించే చాకచక్యం నాకు తక్కువ నా మనసులోని భావాలని సరిగా నీముందు పెట్టలేకపోయేను ఏనాడూ నిన్ను ఎంతోగా ప్రేమిస్తున్నానని దండోరా కొట్టుక తిరిగే తత్వం నాకు లేదు నువ్వు నా మనసుని అర్థం చేసుకుంటా వనుకున్నాను కాని నువ్వు నన్నపార్థం చేసుకున్నావు నా మనస్సులో అమ్మకి తప్ప మరెవ్వరికీ స్థానం లేదనుకున్నావు

మనసుకి ఎల్లలు లేవని నీకు తెలీదా సుశీలా ? అది ఆదిమధ్యాంతరహితమైనది. అది విశ్వాన్నంతటినీ ఇముడ్చుకోగలదు అటువంటిది యీ నా మనస్సు అమ్మనీ, నిన్నేకాక ప్రపంచంలోని ప్రతి ఒక్క జీవినీ ప్రేమించగలదు నీకు నా మనసులో చోటు లేకపోవడమేమిటి ? !

అమ్మకూడా పొరపడింది — నీలానే అనుకుంది కాని దిద్దుకోలేని పొరపాటు కాదది — అమ్మ అర్థం చేసుకోగలదు కాలక్రమేణా

కొడుకు తల్లికి సర్వస్వమూ కాదని ఎవరన గలరు సుశీలా ? దేవుడుకూడా అనలేడు ఇంక అమ్మ నాగురించి అంత ఆత్మీయత కనపరచడానికి అమ్మపట్ల సానుభూతికీ ప్రేమకీ కారణం నీకు తెలుసుకదా ?

ఆనాటి అమ్మ నాకెప్పుడూ గుర్తొస్తుంది ఎంత మంచిది అమ్మ ! యెంత బాగుండేది అమ్మ ! తల దువ్వినా, అన్నం కలిపి తినిపించినా, నా కళ్లలోకి నవ్వుతూ చూసినా, "బాబూ ! రామూ !" అని పిలిచినా, ఎవరో స్వర్గంలోంచి దేవత దిగివచ్చి నన్ను స్వహస్తాలతో పెంచు తున్నట్టనిపించేది

ఎలా మరిచిపోగలను, అమ్మ జీవితం మోడువారిన ఆ సాయంత్రం ! నాన్నా అమ్మలతో కలిసి సినిమాకి వెళ్లవల్సింది, నాన్న శవంతో స్మశానానికి వెళ్లేను నాన్నకోసం బెంగతో చిక్కి, శల్యమై కొనవూపిరితో వుండి, ఏ క్షణం అన్నా నాన్నని వెతుక్కొనిపోటోయేలా తయారైన అమ్మని "వదిలి పోకమ్మా !" అని ఏడుస్తూ వాటేసుకొనే వాడిని

అమ్మ నాకోసమనే బతికింది — బతుకునంతా నాకోసం ధారపోసింది అటువంటి అమ్మని యెలా దూరం చేసుకోగలను ?

మీ యిద్దరూ అన్యోన్యంగా వుంటారనీ, మీ ఇద్దరి అనురాగం, ప్రేమ నాకు దొరుకుతాయని, మన యిల్లు స్వర్గమే ఔతుందనీ అనుకున్నాను కాని నాకు దొరికినది అశాంతి మాత్రమే ! ఇల్లొక నరకంగా తయారయింది

దీని కొకటే పరిష్కారమార్గం ! మీ ఇద్దరూ చల్లటి వెన్నెలలు కురిపించినప్పుడే యింట్లో వుండగలను సూర్యగోళంలా భగ్గున మంటలు మండుతే నేను వాటిలో బుగ్గవక తప్పదు

ఈ వుత్తరం నీకు బుధవారాని కందుతుంది యెంత ఆలస్యమయినా ఈ వుత్తరం నువ్వు చదివేక అమ్మకి చూపించు మీ యిద్దరూ మీ



వైషమ్యాలూ, కోపతాపాలూ త్యజించి, ప్రేమ భావం అలవరచుకుందుకు నిశ్చయించుకుంటారని ఆశిస్తున్నాను.

నా ఆశ మీరు నిజం చేసినట్టయినా మీ యిద్దరూ కలిసి నాకు వుత్తరం రాయండి. మరి మన యింట కలతలూ, కక్షలూ, కావేశాలూ వుండవు కలిసికట్టుగా, హాయిగా వుందాం. వెంటనే వచ్చేమని యిద్దరూ సంతకంపెట్టి నా కుత్తరం రాయండి !

శనివారం నాటికి నాకు జవాబు రావాలి మీనించి.

ఆ జవాబు వచ్చేవరకూ యీ ఊళ్లోనే వుంటాను ఇక్కడ ఇన్స్పెక్షన్ బంగళాలో వుంటున్నాను ఆ అడ్రస్‌కి రాయండి రిజిష్టర్డ్ పోస్ట్ ద్వారా పంపండి ఉత్తరం పోకుండా — లేదా రెండు ఉత్తరాలు రాయండి — ఒకటి తప్పిపోయినా ఒకటి అందుతుంది ఈ వుత్తరం రెండు కాపీలు తీసి రెండు కవర్లలో పోస్ట్ చేస్తున్నాను — ఒకటి తప్పిపోయినా ఒకటైనా అందుతుంది

సోమవారం ఉదయం వరకూ చూస్తాను

సోమవారానికి నాకు జవాబు రానప్పుడు... సరే మంగళవారం బుధవారంకూడా వెయిట్‌చేస్తాను ఆనాటికీ జవాబు రాకపోతే

బీరువాలో వుంది ఏభైవేల జీవితభీమా కాగితం — ఏక్సిడెంట్ వల్ల నేను చచ్చిపోతే లక్షరూపాయలొస్తుంది సగం నీది — సగం అమ్మది. అది కాకుండా ఇల్లు కూడా సగం నీది. సగం అమ్మది బ్యాంక్‌లో పాతికవేలు రొక్కం వుంది అదికూడా పంచుకోండి

లక్ష్మివారం ఉదయం, యస్ కోటకి వెళ్లే దారిలో ఘాట్ చరియలలోకి ప్రమాదవశాత్తూ నేను కారుతోసహా దొర్లుకపోయినట్టు వార్త అందుతుంది నీకు నా శరీరం గుర్తుపట్టడం కష్టం అవొచ్చు — కాని నువ్వూ అమ్మా గుర్తు పట్టగలరుకదా ?

ఈ సంగతి తెలిసాకకూడా మీరు మీ పొరపొచ్చాలు మానుకొని నాకు ఉత్తరం రాయకపోతే నేను బతికుండి ఎవరిని ఉద్ధరించను? మీ ఇద్దరూ శృంగవరపు కోట బస్సులో ఉత్తరం అందిన వెంటనే వస్తే అంతకన్న నాకు కావల్సిందేమిటి !

ఇట్లు,
"వి — రావ్"

## 2

విశాఖపట్నం, మహారాణీపేటలో, సముద్రం కనిపిస్తూ వుండగా, ఆ వీధిలో అధునాతనంగా కట్టుకున్న రెండతస్తుల ఇల్లది ఇంటి చుట్టూ ఆవరణ. ఆవరణలో పూలతోట — ఎన్నోరకాల పువ్వులు

చుట్టూ కాంపౌండు గోడ—దానికో ఆరడుగుల ఇనుప గేటు గేటుకో తాళంకప్ప వుంది. ఇంటికీ తాళంకప్ప పడివుంది. ఇంట్లో యెవ్వరూ లేరని తెలుస్తూ వుంది

ఇనప గేటుకి తగల్చబడ్డ "లెటర్ బాక్స్" అని ఆంగ్లంలో తెల్లటి అక్షరాలతో వున్న నేరేడు రంగు క్రపెట్టెకి చిన్న మిల్లర్ తాళం పడివుంది

పగలు పది గంటలయింది వీధిలో సందడి లేదు ఆరోజు మంగళవారం — (24-8-76) స్కూళ్లూ, కాలేజీలూ, ఆఫీసులూ వుండడంవల్ల ఎక్కడికి వెళ్లవల్సినవారక్కడికి వెళ్లేరు

పోస్ట్‌మాన్‌కూడా తన డ్యూటీ చేసుకుందుకని ఆ వీధికొచ్చి, డాక్టర్ వి రామారావ్, ఎం డీ అని ఆంగ్లంలో నేమ్ ప్లేట్ కాంపౌండు గోడకున్న ఆ యింటిముందు సైకిలాపి దిగేడు నిలబడి, ఇంటికేసి ఆశ్చర్యంగా చూసేడు

ఆలోచిస్తూనే, సైకిల్ క్యారియర్ నించి ఉత్తరాల కట్ట తీసి, అందులోంచి నాలుగు కవర్లు ఎంచి తీసి, ఇనపగేటు కున్న క్రపెట్టెలో వాటిని వేసి, మరోసారి ఇంటికేసి చూసి, పెదవులొకసారి విరిచి, సైకిలెక్కి ముందుకు పోయేడు అక్కడున్న ఏ ఇళ్లకీ ఉత్తరాలు లేకపోవడంవల్ల

పైన ఉదహరించిన మూడు వుత్తరాలూ, ఒక వుత్తరం యొక్క ఎక్స్‌ట్రా కాపీ ఉత్తరం, వెరసి నాలుగు ఉత్తరాలూ, గోరీలలోకి కళేబరాలు వెళ్లినట్టు, ఆ క్రపెట్టెలోకి, ఆ చీకటికోణాల నిశ్శబ్దతలోకి జారిపోయేయి !



'దేవుడున్నాడు జాగ్రత్త'లో రంగనాథ్, సుమిత్ర